www.samasamajam.in
# సమ సమాజం
SAMA SAMAJAM TELUGU DAILY NEWS PAPER
ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం...

ఆది వారం
05-02-2023
సంపుటి - 07,
సంచిక-251
పేజీలు - 4
వెల రూ. 5/-
ఎడిటర్ : పృథ్వీరాజ్. జి
9581442622

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

జర్నలిస్టులందరికీ ఇంటి స్థలాలు ఇస్తాం -మంత్రి కేటీఆర్



2వ పేజీలో...

# నేడు నాందేడ్‌లో బిఆర్ఎస్ సభ

## తెలంగాణ పథకాలపై ఫోకస్ పెట్టనున్న కెసిఆర్





గురుద్వారాలో ప్రత్యేక పూజలు

సభకు భారీగా ఏర్పాట్లు చేసి గులాబీ శ్రేణులు

ఏర్పాట్లను పర్యవేక్షించిన మంత్రి ఇందకరణ్ రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 4 (సమ సమాజం):** బీఆర్ఎస్ పార్టీ విస్తరణలో భాగంగా మహారాష్ట్రలోని నాందేడ్‌లో ఆదివారం జరగబోయే సభకు సర్వం సిద్ధమైంది. కెసిఆర్ ఉదయం నాందేడ్‌కు వెళతారు. సిక్కు గురుద్వారాలో సిఎం కెసిఆర్ ప్రత్యేక పూజలు చేస్తారు. సభాస్థలి వేదికను బీఆర్ఎస్ శ్రేణులు సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. నాందేడ్ పట్టణంతోపాటు సభ స్థలికి వెళ్లే దారులన్నీ కిలోమీటర్లమేర గులాబీ మయమయ్యాయి. అక్కడ వరుస క్రమంలో ఏర్పాటు చేసిన భారీ హోర్డింగులు, బెలూన్లు, స్టిక్కర్లు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. మరోవైపు సభా స్థలిని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి శనివారం పరిశీలించారు. అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాలినడకన

3లో




## ఆదానీ దెబ్బతో ఎల్ఐసికి చిలుము

దీని వెనక ఉన్న అదృశ్య శక్తి ఎవరు

బీమా రంగాన్ని దెబ్బతీసే కుట్రలు?

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4 (సమ సమాజం):** ఆదానీ దెబ్బతో ఎల్ఐసి విలవిలలాడుతోంది. ఎల్ఐసి తన ఉనికిని కలో÷–పోయే ప్రమాదం ఏర్పడింది. దేశం యావత్తూ గళమెత్తినా జీవిత బీమా సంస్థ ఎల్ఐసీలోని వాటాలను విక్రయించ దల్చుకున్నట్టు కేంద్రం ప్రకటించింది. దీని వెనక ఉన్న కుట్ర ఏమిటన్నది ఇప్పుడు అర్థం అవుతోంది. ఇందోలని డబ్బులను ఆదానీలో పెట్టుబడులు పెట్టేందుకే ఇలా చేశారని ఇప్పుడు అర్థం అవుతోంది. ప్రభుత్వరంగ సంస్థలను అమ్ముకుంటూ పోతే నిరుద్యోగాన్ని పారదోలుతామన్న హామీని నమ్మడం ఎలా అన్నదే ప్రశ్న. లాభాల్లో ఉన్న సంస్థలను అమ్ముకుంటూ పోతే దేశంలో ఇక ప్రభుత్వరంగ సంస్థలను ఎలా కాపాడుకుంటామో చెప్పడం లేదు. అధికారం ఇచ్చింది పాలన చేయడానికి అన్నది విస్మరించి అప్పనంగా ఆస్తులను తెగనమ్మడమేనా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇది పాలసీదారుల్లో ఉన్న భరోసాను దెబ్బతీస్తుందిన నిపుణులు హెచ్చరిస్తున్నారు. బీమారంగంలో ప్రైవేటు సంస్థలు ప్రవేశించినా, ప్రజలు ఎల్ఐసీ వైపే

3లో

## ఇంఫాల్‌లో భారీ పేలుడు..తప్పిన ముప్పు

**ఇంపాల్, ఫిబ్రవరి 4 (సమ సమాజం):** మణిపూర్ రాజధాని ఇంపాల్‌లో ఆదివారం బాలీవుడ్ నటి సన్నీ లియోన్ ఫ్యాషన్ షో నిర్వహించాల్సి ఉంది. అయితే ఆ షో వేదిక వద్ద శనివారం ఉదయం భారీ పేలుడు జరిగింది. తెల్లవారుజామున 6.30 నిమిషాలకు వేదికకు సుమారు వంద మీటర్ల దూరంలో పేలుడు సంభవించింది. ఆ పేలుడు వల్ల ఎవరూ గాయపడలేదని తెలిసింది. హట్టా కంజిబుంగ్ ప్రాంతంలో ఈ ఘటన



3లో

## తమిళనాడులో అకాల వర్షాలు

విద్యాసంస్థలకు సెలవు ప్రకటించిన ప్రభుత్వం



3లో

**చెన్నై, ఫిబ్రవరి 4 (సమ సమాజం):** తమిళనాడు రాష్ట్రాన్ని అకాల వర్షాలు ముంచెత్తుతున్నాయి. అల్పపీడన ప్రభావంతో సముద్ర తీర జిల్లాల్లో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. తంజావూర్ జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షాలు పడుతుండటంతో పాఠశాలలు, కళాశాలలకు

## క్యాన్సర్‌ను ముందే గుర్తిస్తే చికిత్స సులభం

క్యాన్సర్ అవేర్‌నెస్ కార్యక్రమంలో వెంకయ్యనాయుడు



3లో

**హైదరాబాద్, ఫిబ్రవరి 4 (సమ సమాజం):** క్యాన్సర్‌తో చనిపోతున్న వ్యక్తులు భారత్‌లోనే టాప్‌టెన్‌లో ఉన్నారని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు వ్యాఖ్యానించారు. క్యాన్సర్ ను సకాలంలో గుర్తిస్తే చికిత్స ఉంటుందని చెప్పారు. క్యాన్సర్ పేషెంట్లకు కాన్ఫిడెన్స్

## డబ్లు ఇళ్లకోసం లబ్ధిదారుల ఆందోళన

గజ్వేల్‌లో రోడ్డెక్కిన పేదలు

**గజ్వేల్, ఫిబ్రవరి 4 (సమ సమాజం):** రాష్ట్రంలో డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారుల ఎంపిక పక్రియ గందరగోళానికి దారి తీసింది. జాబితాలో తమ పేరు లేదంటూ గజ్వేల్‌లో బాధితులు రోడ్డెక్కారు. అనర్హులకు జాబితాలో చోటు కల్పించారంటూ దరఖాస్తుదారులు ఆందోళనకు దిగారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలో 1200 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను



3లో

## తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

9 మెడికల్ కాలేజీలకు మరో 313 పోస్టుల మంజూరు

**హైదరాబాద్, ఫిబ్రవరి 4 (సమ సమాజం):** రాష్ట్రంలో వైద్యం, వైద్య విద్యను పటిష్ఠం చేయడంతోపాటు ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలను అందుబాటులోకి తెస్తున్న ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. ఈ ఏడాది ఏర్పాటు చేయనున్న 9 మెడికల్ కాలేజీలకు మరో 313 పోస్టులను మంజూరు చేసింది. క్లినికల్, నాన్ క్లినికల్ విభాగాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల సృష్టికి అనుమతించింది. ఈమేరకు ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీచేసింది.




3లో

## ములుగు నుంచి హాత్ సే హాథ్ యాత్ర

మేడారం నుంచి పోరుబాటకు సిద్ధం

మీడియా సమావేశంలో రేవంత్, ఠాక్రేలు వెల్లడి

**హైదరాబాద్, ఫిబ్రవరి 4 (సమ సమాజం):** బీజేపీ, టీఆర్ఎస్ ఒకే తాను ముక్కలని టీపీసీసీ రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్న తరుణంలో రాజ్ భవన్



3లో

## రెండోరోజూ ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాలు

### గవర్నర్ ప్రసంగంపై ధన్యావాద తీర్మానంపై చర్చ



- డబుల్ ఇంజన్ కాదు..డబుల్ ఇంపాక్ట్ సర్కార్ రావాలి
- కెసిఆర్‌తోనే అది సాధ్యం అవుతుంది
- దేశానికి అన్నంపెట్టే అన్నపూర్ణగా తెలంగాణ
- వ్యవసాయరంగంలో గణనీయమైన పురోగతి
- విద్య, వైద్యం, విద్యుత్, వ్యవసాయ రంగాల్లో అద్భుత ప్రగతి
- మోడీ పాలనలో అంతా వైఫల్యమే కనిపిస్తోంది
- అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి కెటిఆర్ సమాధానం
- నిజంగానే మాది కుటుంబ పాలనే
- తెలంగాణ ప్రజలంతా కెసిఆర్ కుటుంబ సభ్యులే
- ప్రతిపక్షమంటే విమర్శించడమనే భావన సరికాదు
- అసెంబ్లీలో మంత్రి కెటిఆర్ సమాధానం
- వాడీవేడిగా అసెంబ్లీ సమావేశాలు
- పాతబస్తీ సమస్యలపై పట్టింపు లేదు
- ప్రభుత్వాన్ని నిలదీసిన ఎమ్మెల్యే అక్బరుద్దీన్
- తిప్పికొట్టిన మంత్రి కెటిఆర్
- దేశమంటే ఆదానీ, ప్రధాని మాత్రమే కాదు
- 30 ఏళ్లలో ఎప్పుడూ లేనంతగా ద్రవ్యోల్బణం
- 45 ఏళ్లోల లేనంత పతాక స్థాయికి నిరుద్యోగం
- నాలుగువందల సిలిడంర్ 12 వందలక చేసిన ఘనుడు
- పెట్రోల్ ధరలను 70 నుంచి వంద దాటించారు
- అసెంబ్లీ వేదికగా విరుచుకు పడ్డ మంత్రి కెటిఆర్

**హైదరాబాద్, ఫిబ్రవరి 4 (సమ సమాజం):** తెలంగాణ పథకాలు దేశానికి ఆదర్శంగా... కెసిఆర్ సమర్థ నాయకత్వంలో ముందుకు సాగుతూ..దేశానికి అన్నం పెట్టే అన్నపూర్ణగా అవతరించిందని మంత్రి కెటిఆర్ తెలిపారు. 8 ఏళ్ల పాలనలో అద్భుత విజయాలను సాధిస్తూ ముందుకు సాగుతోందని అన్నారు. ఇదే క్రమంలో కేంద్రం ఎలాంటి సహకారం అందించకపోయినా ముందుకు సాగుతున్నదని, కేంద్రంలో లాగా అసమర్థ పాలన ఇక్కడ లేదని అన్నారు. గవర్నర్ ప్రసంగానికి సిఎం కెసిఆర్‌కు బదులుగా కెటిఆర్ అసెంబ్లీలో సమాధానం చెప్పారు. విద్య,వైద్యం,వ్యవసాయం, సాగుతాగునీటి రంగాలతో పాటు విద్యుత్ రంగాల్లో గణనీయమైన ప్రగతిని సాధించి ఇవాళ దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. అందుకే ఇప్పుడు దేశమంతా తెలంగాణ వైపు చూస్తోందన్నారు. దేశానికి డబుల్ ఇంజిన్ సర్కార్ కాదని నిరూపించామన్నారు. తెలంగాణ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. అందుకే దేశం కెసిఆర్ నాయకత్వం కోసం ఎదురు చూస్తోందని అన్నారు. 24 గంటల

3లో

# సంపాదకీయం

## తెలుగువారిని తలెత్తుకునేలా చేసి విశ్వనాథుడు !



భీష్మాచార్యులు ఇచ్ఛామరణం పొందాడంటారు...ఇవాళ కాశీనాథుని విశ్వనాథుడూ అంతే... తాను చేయాలనుకున్న పనులన్నీ చేసి దివిపథాన మేఘాల పల్లకిలో గర్వంగా ఊరేగుతూ మనందరినీ విడిచి వెళ్లిపోయాడు...భీష్ముడు విష్ణు దివ్య సహస్రనామామృతాన్ని, అర్జునుడికే కాదు.. నిఖిల జగతికీ రుచిచూపి ఆచార్యుడయ్యాడు...విశ్వనాథుడు ఓంకారనాద అనుసంధానమైన శంకరాభరణ గానాన్ని వినిపించి, పాశ్చాత్య మెదళ్ల బూజుదులిపి, మన సంస్కృతి నాడుల్ని తట్టి లేపాడు...విష్ణు సహస్రనామాల అమృతం మనకు అందింది మాఘ శుద్ధ ఏకాదశి పర్వదినాన...!శంకరాభరణం ఓ గొప్ప వరంగా మనకు అందిన రోజే కాక – దాన్ని మనకు అందించి కళాతపస్వి విశ్వనాథుడు దివికేగిన రోజుకూడా భీష్మ ఏకాదశి ద్వాదశి సంధి ఘడియల్లోనే...!! ఎంత యాదృచ్ఛికమో కాక మరోటి కాదు..... విశ్వనాథుని గురించి రాయడమంటే గంగవెల్లువను కమండలంలో ఇమడ్చే సాహసమే అవుతుంది... వేనవేల అక్షరాలు ఆయన గరిమను ఇముడ్చుకోవడానికి వెల్లువలా ముంచెత్తుతాయి...కాని సముద్రం కమండలంలో ఇమడనట్టు, అక్షరాల్లో ఇమడని త్రివిక్రమత్వం విశ్వనాథ కళాతపస్విది...! ఫక్తు వ్యాపార మాధ్యమమైన సినిమాను ఓ కళగా ఆరాధించాడు... సినిమానే ఉపాసించాడు... తపస్సులా చేశాడు ఆ పనిని... అలా ఆ నిరంతర కళాతపస్సు లో ఆయనకు సాక్షాత్కరించిన ఓ అజరామరమైన దృశ్య రూపమే శంకరాభరణం...!!! అంతకుముందు ఎన్నో చిత్రాలకు ఆయన దర్శకత్వం వహించి ఆణిముత్యాలనే అందించారు. కానీ శంకరాభరణంతో సినిమా మాధ్యమాన్ని చేసుకుని ప్రపంచానికి భారతీయను చాటిన మహానుభావుడిగా విశ్వనాథ్ గారు నిలిచారు. అలా ఆ విశ్వనాథుని నిరంతర తపస్సులో ఆయన పొందుతూ వచ్చిన దివ్యానుభూతులెన్నో ఓ శుభలేఖ గా, ఓ స్వాతిముత్యంగా, ఓ సాగరసంగమంగా, ఓ స్వర్ణకమలంగా, ఓ స్వాతికిరణంగా, ఓ స్వయంకృషిగా ఇలా ఎన్నెన్ని శాశ్వత దృశ్యరూపాలై మనకూ, మన పిల్లల తరాలకూ అదృష్టంగా దక్కాయి. 92 ఏళ్ల వయసులో కూడా సినీకళ గురించే పలవరిస్తూ వెళ్లిపోయాడంటే ఆయనది ఎట్లాంటి కళారాధనో అర్థం అవుతుంది.... అందుకే ఆయన కళాతపస్వి విశ్వనాథుడయ్యాడు. ఇవాళ పాన్ ఇండియా అని తెగ చెప్పు కుంటున్నాం కాని – విశ్వనాథ్ ఇవాల్టికి 43 ఏళ్ల క్రిందటే పాన్ ఇండియా కాదు..పాన్ వరల్డ్ గా స్థాయిలో గర్వంగా నిలబెట్టాడు శంకరాభరణంతో తెలుగు సినిమాని..! స్థాయిల గురించిన ఆలోచనే లేదాయనకు... సినిమానే శ్వాసిస్తూ, అదే జీవితంగా తపిస్తూ, జ్వలిస్తూ, ఆరాధిస్తూ ఆలోచనల్ని అందమైన ఫ్రేముల్లో బంధిస్తూ పోవడమే తప్ప ఆయన ఏ అవార్డుల్నీ, రివార్డుల్నీ మనసులో పెట్టుకొని తీయలేదు... ప్రపంచమే ఆయన్ని గుర్తించి, ఆయన దగ్గరికే నడుకుంటూ వచ్చింది...పాటకోసం గింజుకుంటున్నప్పుడు 'ఇలా ఏదో వాక్యంతో మొదలెట్టండి' అని అలవోకగా విశ్వనాథ్ ఇచ్చిన సూచనలే సిరివెన్నెల పాటలెన్నిం టికో మక్కీకి మక్కీగా మకుటాలయ్యాయి... ఈ మాట సిరివెన్నెలే గర్వంగా చెప్పుకున్నాడు... నాకు దైవమిచ్చిన నాన్నగారని ఉద్వేగంతో గద్గదికంగా చెప్పేవారు సిరివెన్నెల...ఇక బాలూ గురించైతే సరేసరి... నేను సంగీతాన్ని శాస్త్రీయంగా నేర్వలేదు మొర్రో అన్నా వినకుండా పట్టుబట్టి బాలూ గళంలోంచి స్వరగంగను దూకించారు విశ్వనాథ్... సంగీతంలో శాస్త్రీయత అనేది పండితులకే పరిమితం కాకుండా, సామాన్యులక్కూడా ఎలా రంజకంగా వుండాలో బాలుగారి నోట రుచి చూపించారు. శంకరాభరణంతో బాలు ఏకంగా ఓ కొత్త అవతారమే ఎత్తాడు... అందుకే అతని దృష్టి మనలా ఉండదు. మనకు అందనంత దూరంలో విశ్వనాథ్ గారు ఉంటారు. అందరూ చూసే గోదారి అతనికింకోలా కనబడుతుంది. అందరం వినే సంగీతం ఆయనకింకోలా వినబడుతుంది.డప్పు సాంబయ్య, వెయిటర్ మూర్తి, అమాయకపు శివయ్య,

అంధుడైన హరిప్రసాద్....ఎవరు వీళ్ళంతా? సమాజంలో వీరి స్థానం ఏమిటి?జనసామాన్యం వీరికి ఎలాంటి విలువనిస్తారో మనకందరికీ తెలుసు.కానీ ఆతని సారథ్యంలో వీరంతా సర్వజనామోదం పొందిన సహృదయమూర్తులు.కిక్కిరిసిన భావోద్వేగంలో చూస్తూంటాం ఈ సన్నివేశం.....'నాప్రాణదీపమై నాలోన వెలిగే.....!' ఆతరవాత తెరలుతెరలుగా దగ్గు, పాదాలనివున్నా పాడలేకపోవడం, అదుగో....అక్షణం కోట్లాదిమందికి ఒళ్ళు గగుర్పొడిచేలా సుస్వరం వినవస్తుంది. శరీరమంతా ఏదో పులకింత కలిగి ఏడుపు తన్నుకొస్తుంది..ఇది ఏఒక్కసారో కాదు. చూసిన ప్రతిసారీ అలానే అనిపిస్తుంది. ఉబికివచ్చే దుఃఖాన్ని ఆపుకుంటూ చూస్తాం మరో దృశ్యం.....తపముని కిరణం తామస హరణంశి వుని నయన త్రయలాస్యం....! అద్భుతంగా నర్తిస్తున్న పాదాలు అచేతనం. ఒక్కసారిగా నిశ్శబ్దం!....చలనంలేని తల్లి శరీరం, చెమర్చడమే మరచిన కన్నులద్వయం...!ఒక్కసారిగా 'ధిరనధిరనన తకిటతకిటధిమి'అని విన్నంతనే ఎవరూ చూడకుండా వెక్కివెక్కి ఏడ్చేవాళ్ళు ఇప్పటికీ వుంటారు. ఇది నిజం. తల్లిపాలంతటి నిజం. కల్మషం, కల్తీలేని ఈదృశ్యాలు కళామతల్లి కిరీటంలో పచ్చలూ కెంపులన దంలో సందేం లేదు.! కళనేకాదు. కళాకారుణ్ణీ గుర్తించాలనే ఈయన 'వేదాంతం' కావాలి ప్రతివారికీ సిద్దాంతం. బుర్రకథలు, హరికథలు, కోలాటాలు, తప్పెటగుళ్ళు కనబడతాయి మనకిక్కడ! గంగిరెద్దుల్ని తిప్పేవాళ్ళచుట్టూ కథంతా తిప్పిన ఘనత ఈకాశీనాధుని విశ్వనాథుడిది!యాయవారాలు, జోలెపట్టి సంగీతార్చన చెయ్యడాలు.....ఒకటేమిటి, మన సంస్కృతీ సంప్రదాయాల్ని తెరనిండుగా ఆవిష్కరించిన నిజమైన నిర్దేశకుడితడు. విశ్వనాథ్ గారి సినిమాలు చూసినప్పుడల్లా మనమెంత పుణ్యం చేసుకున్నామో అనిపిస్తుంది. ప్రపంచంలోని ప్రతి తెలుగువాడూ సగర్వంగా చెప్పుకునేలా.. మాకొక విశ్వనాథ్ ఉన్నాడని తెలుగు సినిమా సగర్వంగా తెలుసుకునేలా చేశాడని..మనమంతా గర్విస్తూ ఆయనకు అశ్రు నివాళి అర్పించడం మినహా ఏమి చేయగలం.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# అక్బరుద్దీన్ వ్యాఖ్యలకు కెటిఆర్ కౌంటర్




## అవసరం లేని విషయాలు మాట్లాడొద్దని వెల్లడి

**హైదరాబాద్, ఫిబ్రవరి 4 (సమ సమాజం):** తెలంగాణ అసెంబ్లీలో ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. అధికార పక్షానికి దాని అనుకూల పార్టీకి మధ్య కౌంటర్ల వార్ జరగడమనేది చాలా అరుదుగా జరుగుతూ ఉంటుంది. నేటి అసెంబ్లీలో అదే జరిగింది. మంత్రి కేటీఆర్‌కు ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఒవైసీకి మధ్య ఘాటు ఘాటుగా విమర్శల పర్వం నడిచింది. సభా నాయకుడితో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు కనిపించకపోవడంపై అక్బరుద్దీన్‌కు చిర్రెత్తుకొచ్చినట్టుంది. ఇలాంటి సభను తన 25 ఏళ్లలో ఏనాడూ చూడలేదు. బీఆర్ఎస్ నేతలకు టీవీ డిబేట్‌లకు వెళ్లే టైం ఉంటుంది కానీ సభకు వచ్చే టైం లేదా? అని ఎద్దేవా చేశారు. సభా నాయకుడితో సంబంధమేంటని కేటీఆర్ ప్రశ్నించారు. హామీలు ఇస్తారు.. అమలు చేయరు. సీఎం, మంత్రులు మమ్మల్ని కలవరు. మీరు చెప్రాసిని చూపిస్తే వారినైనా కలుస్తాం. పాతబస్తీలో మెట్రోరైలు సంగతి ఏమిటి? ఉస్మానియా ఆస్పత్రి పరిస్థితేంటి ? ఉర్దూ రెండో భాష అయినా అన్యాయమే. బీఏసీ లో ఇష్టారీతిలో నిర్ణయాలు తీసుకున్నారు. చర్చ సందర్భంగా సభా నాయకుడు కనిపించడం లేదు. మంత్రులు, ఎమ్మెల్యేలు సభలో కనిపించడం లేదు. టీవీ చర్చలకు వెళ్లే బీఆర్ఎస్ నేతలకు సభకు వచ్చే తీరిక లేదా? మంత్రులు అందుబాటులో లేరన్నది అవాస్తవం. ఏడుగురు సభ్యులు ఉన్న పార్టీ ఎక్కువ టైమ్ అడగడం సరికాదు. సభ్యులను బట్టి పార్టీలకు సమయం కేటాయిస్తాం. బీఏసీకి రాకుండా అక్బరుద్దీన్ వ్యాఖ్యలు చేయడం సరికాదు. ఆవేశంగా మాట్లాడటం కాదు.. అర్థవంతంగా సమాధానం ఇవ్వాలి. సభా నాయకుడితో ఒవైసీకి ఏం సంబంధం అని ప్రశ్నించారు. నేను కొత్త సభ్యున్ని కాదు.. చాలా సార్లు ఎమ్మెల్యే అయ్యా. టైంను ఎలా ఉపయోగించుకోవాలో మాకు తెలుసు.. రాజ్యాంగబద్ధంగా చర్చ జరగాలి. గతంలో చాలా సభల్లో గంటల సేపు చర్చించాం. ఎప్పుడూ అభ్యంతరం చెప్పలేదని ఒవైసీ అన్నారు.

# జర్నలిస్టులందరికీ ఇంటి స్థలాలు ఇస్తాం –మంత్రి కేటీఆర్

**హైదరాబాద్, ఫిబ్రవరి 4 (సమ సమాజం):** రాష్ట్ర రాజధాని హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలన్నది ప్రభుత్వ లక్ష్యమని, కొందరికే ఇచ్చి వివాదాలు కొనితెచ్చుకోవడం తమకు ఇష్టం లేదని రాష్ట్ర మున్సిపల్ మరియు పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. కోర్టు తీర్పు మేరకు తమ సొసైటీ సభ్యులకు ఇంటి స్థలాలు కేటాయించాలని జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్ట్స్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ డైరెక్టర్ వంశీ నేతృత్వంలో జర్నలిస్ట్స్ ప్రతినిధి బృందం శుక్రవారం రోజు అసెంబ్లీ లాబీలో మంత్రి కేటీఆర్ ను కలిసి విజ్ఞప్తి చేయగా, ఆయన పై విధంగా స్పందించారు. తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన పలువురు జర్నలిస్టులు నేటికి సొంత ఇండ్లు లేకుండా ఉన్నారని, వారికి కూడా న్యాయం చేయాల్సిన బాధ్యత తమపై ఉంటుందన్నారు. కొందరికే ఇంటి స్థలాలు అందించి మిగితావారందరినీ నిరాశపర్చడం సరైంది కాదన్నారు. అంతేకాకుండా ఎన్నికల సమయంలో ఇలాంటి తలనొప్పులు వద్దని ఆయన సూచించారు. ఇందుకుగాను ఎలాంటి వివాదాలకు తావు కల్పించకుండా, అందరి సమన్వయంతో, అర్హులైన జర్నలిస్టులందరీ జాబితాను రూపొందించుకొని తన వద్దకు వస్తే, సీఎం కేసీఆర్ ను కలిసి ఇంటి స్థలాల సమస్యను పరిష్కరించేందుకు తనవంతు సహకారాన్ని అందిస్తానని కేటీఆర్ తెలిపారు....

# 12 వరకు మాత్రమే అసెంబ్లీ సమావేశాలు



1న బడ్జెట్ సమర్పణ..12 ద్రవ్య వినిమయ ఇల్లు

**హైదరాబాద్, ఫిబ్రవరి 4 (సమ సమాజం):** తెలంగాణ అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై ప్రతిపక్షాలకు ప్రభుత్వం షాకిచ్చింది. 25 రోజుల పాటు అసెంబ్లీని నిర్వహించాలన్న ప్రతిపక్షాల అభ్యర్థనను సర్కార్ పక్కన పెట్టింది. ఈ నెల 12 వరకు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈనెల 6న బడ్జెట్ ను అసెంబ్లీలో ప్రవేశపెట్టనుంది. 7న అసెంబ్లీకి సెలవు. తిరిగి 8న బడ్జెట్‌పై సభలో సాధారణ చర్చ జరుగ నుంది. 9, 10, 11 మూడు రోజుల పాటు పద్దులపై చర్చ జరుగనుంది. 12న ద్రవ్య వినిమయ బిల్లుకు సభ ఆమోదం తెలుపనుంది. తరవాత అసెంబ్లీ వాయిదా పడనుంది. అసెంబ్లీ సమావేశాలు 25 రోజుల పాటు కొనసాగించాలని ప్రతిపక్షాలు పట్టుబడుతున్న విషయం తెలిసిందే. సమస్యలు అనేకం ఉన్నందున వాటిని చర్చించేందుకు సమావేశాలను ఎక్కువ రోజులు జరపాలని సిఎల్‌పి నేత భట్టి విక్రమార్క కోరారు. బిఏసీ సమావేశంలో అసెంబ్లీ సమావేశాలను 25 రోజుల పాటు నిర్వహించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. అలాగే ఎంఐఎం సైతం సభను 20 రోజుల పాటు కొనసాగించాలని పట్టుబడింది. సమావేశాల కొనసాగింపు 8న నిర్ణయిం తీసుకుంటామని ప్రభుత్వం చెప్పడంపై ప్రతిక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. అయితే కేవలం ఆరు రోజుల పాటు సభను నిర్వహించడంపై ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి.

# కరెంట్ ఎప్పుడు వస్తుందో..ఎప్పుడు పోతుందో

## మండలిలో విమర్శలు గుప్పించిన జీవన్ రెడ్డి



**హైదరాబాద్, ఫిబ్రవరి 4 (సమ సమాజం):**శాసనమండలి సమావేశాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ భానుప్రసాద్ మధ్య వాగ్వాదం జరిగింది. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మాట్లాడుతుండగా ఎమ్మెల్సీ భానుప్రసాద్ అడ్డుపడ్డారు. దీంతో చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు మంత్రి కాదు అలాంటప్పుడు జీవన్ రెడ్డి మాట్లాడుతుంటే ఎందుకు అడ్డుపడుతున్నారని ప్రశ్నించారు. ఆ తర్వాత ప్రసంగాన్ని కొనసాగించిన జీవన్ రెడ్డి వాస్తవాలకు భిన్నంగా గవర్నర్ ప్రసంగం ఉందన్నారు. క్షేత్రస్థాయిలో కరెంట్ ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి ఉందని అన్నారు. దీనిపై ట్రాన్స్ కో సీఎండీ ప్రభాకర్ రావుతో మాట్లాడానని జీవన్ రెడ్డి అనగా.. సభలో లేని వ్యక్తుల పేర్లు తీయొద్దని చైర్మన్ సూచించారు. ఆ పదాలను శాసనమండలి రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడ కరెంట్ ఇబ్బందులు ఉన్నాయో ఆ వివరాలను మంత్రికి తెలియజేస్తే ఆయన సమస్యను పరిష్కరిస్తారని చెప్పారు. రైతులకు ఎంత కరెంట్ కావాలో అంత ఇస్తున్నారని చైర్మన్ స్పష్టం చేశారు.

# కెసిఆర్ సంపద సృష్టిస్తుంటే... కేంద్రం అమ్ముతోంది !

రాష్ట్రంలో ఉపాధిరంగం ఎంతగానో అభివృద్ధి చెందింది

మండలిలో ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆరోపణ



**హైదరాబాద్, ఫిబ్రవరి 4 (సమ సమాజం):** సీఎం కేసీఆర్ సంపద సృష్టిస్తుంటే.. కేంద్రం మాత్రం ఉన్న సంపదను అమ్మేస్తోందని ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆరోపించారు. సీఎం కేసీఆర్ లక్ష్యాలు దేశం మొత్తం విస్తరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. రాష్ట్రంలో ఉపాధిరంగం ఎంతగానో అభివృద్ధి చెందిందని పల్లా అన్నారు. శాసనమండలిలో గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానాన్ని ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, గంగాధర్ గౌడ్ ప్రవేశపెట్టారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ఎలాంటి కేటాయింపులు జరుగలేదని పల్లా అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఐఐటీ, గిరిజన యూనివర్సిటీ ఊసేలేదన్నారు. విభజన హామీలైన కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కుఫ్యాక్టరీ ఏమయ్యాయని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆస్తులన్నింటినీ అదానీకే కట్టబెబడుతున్నారని విమర్శించారు. ఐటీ రంగంలో 2 లక్షల 55 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు. దాదాపు 7 లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించిందని చెప్పారు. 2014 నుంచి ఇప్పటివరకు ఆర్థిక వృద్ధిరేటు 128 శాతం పెరిగిందన్నారు. రాష్ట్ర జీఎస్‌డీపీ 11 లక్షల 48 వేల కోట్లకు చేరగా.. రాష్ట్రంలో తలసరి ఆదాయం 3 లక్షల 17 వేలుగా ఉందని వివరించారు. తెలంగాణలో ఉపాధి రంగం ఎంతగానో అభివృద్ధి చెందిందని ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. ఐటీ రంగంలో రూ.2 లక్షల 55 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. దాదాపు 7 లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించిందన్నారు. 2014 నుంచి ఇప్పటివరకు ఆర్థిక వృద్ధిరేటు 128 శాతం పెరిగిందన్నారు. రాష్ట్ర జీఎస్‌డీపీ 11 లక్షల 48 వేల కోట్లకు చేరిందని వెల్లడించారు. రాష్ట్రంలో తలసరి ఆదాయం రూ.3 లక్షల 17 వేలుగా ఉందని తెలిపారు. ఒక్క ఐఐటీ కూడా లేదని, గిరిజన యూనివర్సిటీ ఊసేలేదన్నారు. విభజన హామీల్లో పేర్కొన్న కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కుఫ్యాక్టరీ సంగతి మరిచారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వ ఆస్తులన్నింటినీ అదానికి కట్టబెట్టేస్తు న్నారని చెప్పారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ సంపద సృష్టిస్తుంటే.. కేంద్రం మాత్రం ఉన్న సంపదను అమ్మేస్తున్నదని విమర్శించారు. చివరికి ఎల్ఐసీని కూడా అదాని కాళ్లదగ్గర పెట్టారని చెప్పారు. దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణ ఉద్యోగులకు అధిక వేతనాలు అందిస్తున్నామని వెల్లడించారు. సీఎం కేసీఆర్ లక్ష్యాలు దేశం మొత్తం విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు.

# బిఆర్ఎస్ బెదరింపులకు భయపడేది లేదు



దాడులు చేస్తే రెట్టింపు స్థాయిలో ప్రశ్నిస్తాం● వైఎస్ షర్మిల విమర్శలు

**వరంగల్, ఫిబ్రవరి 4 (సమ సమాజం):** ప్రజల పక్షాన పోరాడటమే తప్పా....? అని వైఎస్ఆర్టీపీ చీఫ్ వైఎస్ షర్మిల ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతల బెదిరింపులకు, దాడులకు వైఎస్ షర్మిల భయపడదని స్పష్టం చేశారు. మీ దాడులకు రెట్టింపు స్థాయిలో మీ అవినీతిని ప్రశ్నిస్తామని తేల్చి చెప్పారు. నిన్న జరిగిన దాడిపై పోలీసులు ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్న షర్మిల...మీలాంటి జేజమ్మలని ఎంతో మందిని చూశానన్నారు. మరోసారి చెప్తున్నా బీఆర్ఎస్ నాయకులు ఒళ్లు దగ్గర పెట్టుకోండి అంటూ హెచ్చరించారు. గతంలో నర్సంపేటలో తమ బస్సును తగలబెట్టి, తమపై దాడి చేశారని ఆరోపించారు. నిన్న వర్ధన్నపేటలో ప్రజా ప్రస్థానం యాత్రపై దాడి చేశారని, ఏం జరిగినా తన పాదయాత్ర తిరిగి మొదలుపెట్టానని చెప్పారు. ప్లెక్సీలు చింపి, కవరేజ్ చేస్తున్న మీడియాపై దాడికి యత్నించారన్నారు. ప్రజల తరపున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న తనపై దాడులు చేస్తారా? అని ఆమె నిలదీశారు. సెక్రెటేరియట్ లో ఏదో జరుగుతోందని ఆమె అనుమానం వ్యక్తం చేశారు. మాక్ డ్రిల్ జరిగితే ప్రతిపక్షాలను ఎందుకు అనుమతించలేదని ప్రశ్నించారు. ఎన్నో హామీలు ఇచ్చి, ప్రజలను మోసం చేసింది బీఆర్ఎస్ అని షర్మిల చెప్పారు. ప్రజలు చేస్తున్న ఆరోపణలనే తాను ప్రస్తావించానని, అరూరి రమేష్ రైతులపై థర్డ్ డిగ్రీ చేపించింది నిజం కాదా? అని ప్రశ్నించారు. కబ్జాలు చేయడం నిజం కాదా, ఏకంగా మందకృష్ణ భూమినే కబ్జా చేశారు అని వాదించారు. వర్ధన్నపేట మున్సిపాలిటీ అవినీతిపై సొంత పార్టీ కౌన్సిలర్ల నిరసన నిజం కాదా? అని నిలదీశారు. మీ అక్రమాలను ప్రశ్నిస్తే భుజాలు తడుముకుంటున్నారని, ప్రజా సేవ చేయాలనే సోయి బీఆర్ఎస్ మంత్రులకు, ఎమ్మెల్యే లకు లేదని విమర్శించారు. పర్వతగిరి నుండి మంత్రిగా ఉన్న ఎర్రబెల్లి గ్రామానికి ఏం చేశారని ప్రశ్నించానని చెప్పారు. అప్పులపాలై సర్పంచులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్న షర్మిల.. పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి ఏం చేస్తున్నారు? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్పంచులకు నిధులు అందించా ల్సింది పోయి ఖాళీ బీరు సీసాలు అమ్మమంటారా...? అంటూ మండిపడ్డారు. వీళ్ళని ఎవరూ నిలదీయక పోవడంతోనే ఇలా తయారయ్యారన్న షర్మిల.. ఎవరు మాట్లాడితే వాళ్లపై దాడులు, కేసులు పెడుతు న్నారని, దమ్ముంటే మంచి పాలన అందించండని సవాల్ విసిరారు.

# ప్రజలను ఐక్యం చేయడంలో జాతరల పాత్ర పెద్దది



పెద్దగట్టు జాతరకు ఏర్పాట్లు పూర్తి● 5 నుంచి 9 వరకు జాతర: జగదీశ్ రెడ్డి

**సూర్యాపేట, ఫిబ్రవరి 4 (సమ సమాజం):** సమాజాన్ని ఒక క్రమపద్ధతిలో నడపడంలో ఆయా ప్రాంతాలు, వర్గాల సంస్కృతీ సాంప్రదాయాల పాత్ర కీలకమని మంత్రి జగదీశ్ రెడ్డి అన్నారు. ప్రజలను ఐక్యం చేయడంలో పెద్దగట్టు వంటి జాతరలు దోహదపడుతాయని చెప్పారు. రాష్ట్రంలో రెండో అతిపెద్ద జాతరకు ప్రభుత్వం తరుపున అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. సూర్యాపేటలోని గొల్ల బజార్ ఎల్లమ్మ గుడిలో పెద్దగట్టు జాతరలో తొలి ఘట్టమైన మకర తోరణం తరలిపు ప్రక్రియను ప్రత్యేక పూజలు చేసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్‌తో కలిసి భేరీలు వాయించారు. అనంతరం మంత్రి జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో అన్ని కులాలు, మతాలకు సమన్యాయం కల్పించామన్నారు. ఆదివారం రాత్రి కేసారం నుంచి దేవర పెట్టే తరలింపు ప్రక్రియ ఉంటుందని చెప్పారు. సోమవారం నుంచి జాతరకు భక్తులు వస్తారని వెల్లడించారు. మూడు రోజులపాటు తెలంగాణ నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా 15 లక్షల మంది భక్తులు వస్తారని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. దురాజ్‌పల్లి పెద్దగట్టు జాతర ఈ నెల 5వ తేదీన ప్రారంభమై.. 9వ తేదీ వరకు కొనసాగనుంది. దీంతో హైదరాబాద్ – విజయవాడ హైవే పై ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు పోలీసులు ప్రకటించారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లే వాహనదారులు.. టేకుమట్ల నుంచి ఖమ్మం బైపాస్ రోడ్డు మీదుగా వెళ్లాలని సూచించారు. ఈ వాహనాలన్నీ నామాపురం వద్ద జాతీయ రహదారి 65పై కలుస్తాయి. విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వచ్చే వాహనదారులను రోళ్లబావి తండా వద్ద మళ్లించనున్నారు. రయాన్‌గూడెం వద్ద హైవేపై కలుస్తాయి. హెవీ ట్రాన్స్‌పోర్టు వెహికల్స్‌ను కోదాడ వద్ద మళ్లించి, మిర్యాలగూడ, నల్లగొండ, నార్కెట్‌పల్లి మీదుగా హైదరాబాద్‌కు పంపించనున్నారు. మొత్తంగా లింగమంతుల స్వామి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. పెద్దగట్టు జాతరకు రూ. 6.5 కోట్లు కేటాయించారు. మహిళలకు ప్రత్యేక స్నానపు గదులు,చేజింగ్ రూమ్స్ ఏర్పాటు చేశారు. తాగునీటి వసతి కల్పించారు. ఐదు రోజుల పాటు కొనసాగే ఈ జాతరకు 15 లక్షల మంది హాజరయ్యే అవకాశం ఉందని పోలీసులు, అధికారులు అంచనా వేస్తున్నారు.

# బీఆర్ఎస్ పార్టీకి ప్రత్యామ్నాయం బీజేపీయే

## బీజేపీ కార్యవర్గ సమావేశంలో కోమటిరెడ్డి



**యాదాద్రి, ఫిబ్రవరి 4 (సమ సమాజం):** రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీకి ప్రత్యామ్నాయం బీజేపీయే అని మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. యాదాద్రి జిల్లా ఆలేరులో జరిగిన బీజేపీ కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. 2014 తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కిందని రాజగోపాల్ ఆరోపించారు. తెలంగాణ అంటే కొడుకు, కూతురు మాత్రమే ఉన్నారా.. ప్రజల అవసరాలు కనపడలేదా అని ప్రశ్నించారు. కేసీఆర్ ఎనిమిదిన్నరేండ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చాడని ఆరోపించారు. మోడీ విధానాల ఫలితంగా ప్రపంచం మొత్తం ఇప్పుడు భారత్ భారత్ వైపు చూస్తుందన్నారని అన్నారు.ఆలేరు ఎమ్మెల్యే అధికారం అడ్డుపెట్టుకొని అడ్డగోలుగా ఆస్తులు కూడగట్టుకున్నారని రాజగోపాల్ రెడ్డి ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వంపై 68? ప్రజా వ్యతిరేకత ఉందన్న ఆయన..రానున్న రోజుల్లో రాష్ట్రంలో కాషాయం జెండా ఎగరడం ఖాయమన్నారు. కేసీఆర్ ప్రభుత్వ తప్పుడు విధానాలను ప్రతి కార్యకర్త ఎప్పటి కప్పుడు ఎండగట్టాలని సూచించారు.

# ములుగు నుంచి హాత్ సే హాథ్ యాత్ర



(మొదటి పేజి తరువాయి) వేదికగా ఆ ఇద్దరు నాటకాలకు తెర తీశారని విమర్శించారు. అసెంబ్లీ సాక్షిగా గవర్నర్ వచ్చి అబద్దాలతో కేసీఆర్‌ను ప్రశంసించారని రేవంత్ మండిపడ్డారు. ఇప్పటి వరకు అనేక విషయాల్లో కేసీఆర్ పనితీరును చెండాడిన గవర్నర్.. ఇప్పుడు స్వరం ఎందుకు మార్చారని ప్రశ్నించారు. కేటీఆర్ క్యాట్ వాక్, డిస్కో డాన్స్‌ల గురించి మాట్లాడుకుంటే మంచిదని... దేశ భద్రత, సంస్కృతి ఆయనకు తెలియదని రేవంత్ విమర్శించారు. రాహుల్ గాంధీ గురించి మాట్లాడే స్థాయి కేటీఆర్‌కు లేదన్న ఆయన.. కాంగ్రెస్‌కు దేశ ప్రయోజనాలే ముఖ్యమని చెప్పారు. ప్రజలు, ప్రజాస్వామ్యం పట్ల విశ్వాసం లేని కేసీఆర్‌కు ఇవే చివరి ఎన్నికలని, అందుకే ఈ రోజు కొడుకుకు అసెంబ్లీలో మాట్లాడే అవకాశం ఇచ్చారని అన్నారు. ఈ నెల 6న ములుగు జిల్లా మేడారం సమ్మక్క సారాలమ్మ నుంచి హాత్ సే హాత్ జోడో అభియాన్ పాదయాత్ర ప్రారంభించనున్నట్లు రేవంత్ రెడ్డి ప్రకటించారు. వనదేవతలు నిరంకుశ రాజులపై పోరాడారని, ఇప్పుడు తాము గడీల నియంతపై పోరాటానికి మేడారంను ఎంచుకున్నామని అన్నారు. దివంగత వైఎస్ చేవెళ్ల నుంచి పాదయాత్ర చేయగా, ఇప్పుడు సీతక్క నియోకవర్గం ములుగు నుంచి యాత్రకు శ్రీకారం చుట్టబోతున్నామని అన్నారు. 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పది రోజుల పాటు పాదయాత్ర చేస్తానని చెప్పారు. గతంలో చేవెళ్ల నుంచే వైఎస్సార్ పాదయాత్ర చేపట్టారని.. అక్కడి నుంచే కాంగ్రెస్ పార్టీ జైత్రయాత్ర మొదలైందని అన్నారు. ఆనాడు రాజులు, రాచరికం మీద పోరాడిన సమ్మక్క సారాలమ్మ స్ఫూర్తితోనే ఈ యాత్ర చేపడుతున్నానని స్పష్టం చేశారు. ‡ాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రకు కొనసాగింపుగా అన్ని రాష్ట్రాల్లో హాత్ సే హాత్ జోడో అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని కాంగ్రెస్ ఇంచార్జ్ మానిక్ రావ్ ఠాక్రే తెలిపారు. రాహుల్ సందేశాన్ని ఇంటింటికి తీసుకెళ్లడమే తమ లక్ష్యమన్నారు. ఈ నెల 6న ప్రతి నియోజకవర్గంలో ప్రతి నాయకుడు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. భట్టి, మధుయాష్కీ, ఉత్తమ్, ఇతర ముఖ్య నేతలు వివిధ ప్రాంతాల్లో ఈ యాత్రను మొదలుపెడతారని అన్నారు. రెండు నెలల పాటు సాగే యాత్రలో కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వాల అసంబద్ధ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని మానిక్ రావ్ ఠాక్రే ప్రకటించారు.

# డబ్బు ఇళ్లకోసం లబ్ధిదారుల ఆందోళన

(మొదటి పేజి తరువాయి) నిర్మించిన ప్రభుత్వం లబ్దిదారుల ఎంపిక కోసం అభ్యంతరాలను తెలియజేయడానికి శుక్రవారం జాబితా విడుదల చేసింది. అయితే లిస్టులో పేరులేని వారు తమకు అన్యాయం జరిగిందంటూ ఆందోళనకు దిగారు. జాబితాలో చాలామంది అనర్హులు ఉన్నారని.. అర్హులైన తమ పేర్లు లిస్టులో రాలేదని వందల సంఖ్యలో లబ్దిదారులు పట్టణంలోని అంబేద్కర్ చౌక్ వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే, డీసీసీ ప్రెసిడెంట్ నర్సారెడ్డి వారికి సంఘీభావం తెలిపారు. దరఖాస్తుదారులు మున్సిపల్ కార్యాలయం ముందుకు వెళ్లి అక్కడ నిరసన చేపట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకుని వారికి సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. మరోవైపు తమకు న్యాయం జరిగే వరకు ఆందోళన విరమించేది లేదని లబ్దిదారులు చెబుతున్నారు. గజ్వేల్ లో మొత్తం 1200 ఇండ్ల కోసం 3500 మంది దరఖాస్తు చేసుకున్నారు.

## ఇంఫాల్‌లో భారీ పేలుడు..తప్పిన ముప్పు

(మొదటి పేజి తరువాయి) జరిగింది. అయితే ఆ పేలుడుకు కారణాలు ఇంకా తెలియరాలేదు. ఐఈడీ లేక గ్రానైడ్ వల్ల ఆ పేలుడు సంభవించిందా అన్న విషయం తేలాల్సి ఉంది. పేలుడుకు బాధ్యత వహిస్తూ ఇప్పటి వరకు మిలిటెంట్ సంస్థలు ప్రకటించలేదు.

## తమిళనాడులో అకాల వర్షాలు



(మొదటి పేజి తరువాయి) ప్రభుత్వం సెలవు ప్రకటించింది. నగరంలో శనివారం ఉష్ణోగ్రతలు 27 డిగ్రీలుగా ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. తమిళనాడు, శ్రీలంక తీరంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో అకాల వర్షాలు కురుస్తున్నాయి. దీంతో నాగపట్టణం, తరువారూర్ జిల్లాల్లో గురువారం నుంచి పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించారు. తిరువారూర్‌లో పాఠశాలకు సెలవు ప్రకటిస్తూ కలెక్టర్ నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు రాష్ట్రంలోని 11 జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. కాగా, వాయువ్య భారతదేశంలో ఈ నెలలో సాధారణ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం అంచనా వేసింది. రానున్న రోజుల్లో చలిగాలుల ప్రభావం తగ్గుతుందని పేర్కొంది.

# రామంతాపూర్ ప్లైవుడ్ గోదాంలో అగ్నిప్రమాదం



హైదరాబాద్, ఫిబ్రవరి 4 (సమ సమాజం): నగరంలో వరుస అగ్నిప్రమాదాలు ఆందోళనలు కలిగిస్తున్నాయి. వేసవికాలం ఇంకా రాకముందే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటే ఆ తర్వాత ఏంటా అనే ఆందోళన ప్రజల్లో నెలకొంది. ఇటీవల సికింద్రాబాద్, వనస్థలిపురం, బాగ్‌లింగంపల్లిలోని గోదాంలలో జరిగిన ప్రమాద ఘటనలు మరువకముందే తాజాగా రామంతపూర్‌లోని ఈజీ ప్లైవుడ్ గోదాంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. శనివారం తెల్లవారుజామున షార్ట్ సర్క్యూట్ కారణంగా గోదాంలో మంటలు చెలరేగాయి. నిముషాల్లో గోదాం మొత్తం భారీగా మంటలు వ్యాపించడంతో ప్లై వుడ్ మొత్తం కాలిబూడిదైంది. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని ఎంతో శ్రమించి మంటలను అదుపులోకి తీసుకున్నారు. మూడు ఫైరిరజన్లతో మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో భారీగా ఆస్తినష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. అయితే ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

# తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

(మొదటి పేజి తరువాయి) ఇప్పటికే ఈ మెడికల్ కాలేజీలకు 3,897 పోస్టులను మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఒక్కో మెడికల్ కాలేజీ, అనుబంధ హాస్పిటల్‌కు వివిధ కేటగిరీల్లో కలిపి 433 పోస్టులను సృష్టించింది. ఇటీవల సీఎం కేసీఆర్ ఎనిమిది కొత్త మెడికల్ కాలేజీలను ప్రారంభించిన సంగతి తెలిసిందే. తర్వాతి దశలో రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి, వికారాబాద్, ఖమ్మం, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, కుమ్రం భీం ఆసిఫాబాద్, జనగామ, నిర్మల్ జిల్లాల్లో మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికే పరిపాలన అనుమతులు మంజూరు చేసి, బడ్జెట్‌లో నిధులనూ కేటాయించింది. తాజాగా ఆయా కాలేజీలకు మరో 313 పోస్టులను మంజూరు చేసింది.

## క్యాన్సర్‌ను ముందే గుర్తిస్తే చికిత్స సులభం



(మొదటి పేజి తరువాయి) ఇవ్వడం ముఖ్యమని తెలిపారు. దేశంలో క్యాన్సర్ ట్రీట్మెంట్ చాలా అభివృద్ధి చెందిందన్న వెంకయ్య.. క్యాన్సర్ ట్రీట్మెంట్ చేయడంలో ప్రైవేట్ రంగం సేవలు మరువలేనివని కొనియాడారుహైటెక్ సిటీలోని మెడికవర్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ లో క్యాన్సర్ అవేర్నెస్ అండ్ క్యాన్సర్ పేషెంట్ పై జరిగిన సదస్సులో వెంకయ్య నాయుడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. క్యాన్సర్ నుండి కోలుకొని మళ్ళీ జీవితం ప్రారంభించిన పేషెంట్లను, వారి కుటుంబ సభ్యులను కలుసు కోవడం ఆనందంగా ఉందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. కన్న తల్లి, పుట్టిన భూమిని, మాతృ భాషను, చదువును చెప్పిన గురువును మర్చిపోయిన వాడు మనిషే కాదని తన అభిప్రాయమన్నారు. క్యాన్సర్ వస్తే కుటుంబ సభ్యులు మొత్తం ఇబ్బందులు పడుతారన్న ఆయన.... దేశంలో ఏడాదికి పది లక్షల క్యాన్సర్ కేసులు నమోదు అవుతున్నాయని చెప్పారు. క్యాన్సర్ రాకుండా ఉండాలంటే ప్రజలు లైఫ్ స్టైల్ మార్చుకోవాలని, జంక్ ఫుడ్ తినడం మానేయాలని సూచించారు. నాటు కోడి పులుసు, గటుక ఆహారంగా తీసుకోవాలని చెప్పారు. వెస్టర్న్ లైఫ్ స్టైల్ మన దేశ ప్రజలకు అస్సలు మంచిది కాదని చెప్పారు.

# ఆదానీ దెబ్బతో ఎల్ఐసికి చిలుము

(మొదటి పేజి తరువాయి) మొగ్గు చూపుతున్నారు. ఇప్పటికీ ఆ సంస్థే అగ్రగామిగా కొనసాగు తోంది. ఈ నేపథ్యంలో కేంద్రం పునరాలోచించడం ఉత్తమం. ప్రస్తుతం కేంద్రానికి ఎల్ఐసీలో పది శాతం వాటావుంది. దండిగా లాభాలు ఆర్జిస్తున్న ఎల్ఐసీలో ప్రైవేటీకరణకు వీలుకల్పించే ఈ చర్య అమలు అంత సులభం కాదు. కేంద్రం నిధులు సమకూరిస్తే తప్ప నడిచే అవకాశం లేని సంస్థలను వదిలిపెట్టి నిక్షేపంలా ఉండే సంస్థల ను ప్రైవేటు పరం చేయడమేమిటన్నది ప్రశ్న. ఎల్ఐసీ ఏ రోజూ ఆర్థికంగా ఇబ్బందుల్లో పడలేదు. ప్రభుత్వాన్ని ప్రాధేయపడలేదు. సరికదా... నష్టాల్లో మునిగిన అనేక పబ్లిక్ రంగ సంస్థల్ని బతికించడానికి దాని నిధులే అక్కరకొస్తున్నాయి. వివిధ మౌలిక సదుపాయరంగ ప్రాజెక్టులకు అవసరమైన నిధులు సమీకరిస్తూనే, ద్రవ్యలోటు రాకుండా చూడటానికి ఎల్ఐసీలోనూ, ఐడీబీఐలోనూ ఉన్న వాటాలను కేంద్రం విక్రయించదల్చుకుంది. ఈ వాటాల విక్రయం ద్వారా రూ. 90వేల కోట్లు వస్తాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ప్రజల్లో వినిమయాన్ని పెంచి, డిమాండ్ పెరిగేలా చేసినప్పుడే తయారీ రంగం కోలుకుంటుంది. ఇకపోతే ఎల్ఐసి లాంటి బీమా సంస్థల్లో ప్రజలు పెద్ద మొత్తంలో చేరేలా... అలా చేరితే రాయితీలు ఇచ్చేలా ఆదాయపన్నులో వెసలుబాటు ఉండాలి. కానీ అలా జరక్కపోవడం అన్నది ప్రైవేట్ సంస్థల ప్రోద్బలం ఉందా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. ఇకపోతే ఆదాయపన్నుకు సంబంధించి కేంద్ర ఆర్థికమంత్రి చేసిందల్లా ఏది కావాలో ఎంచుకునే స్వేచ్ఛ వేతన జీవులకివ్వడమే. ఏ కత్తి మెత్తగా తెగుతుందో ఎవరికి వారు తేల్చుకోవాల్సివుంటుంది. గృహ నిర్మాణరంగం సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న తరుణంలో మినహాయింపులు తొలగించడం ఆ రంగానికి చేటు కలిగించడం ఖాయంగా కనిపిస్తుంది. అలాగే బీమా ప్రీమియంలు చెల్లించేవారికిచ్చే మినహాయింపులు కూడా కొత్త విధానంలో కనుమరుగయ్యాయి. దేశ ఆర్థిక వ్యవస్థలో, మరీ ముఖ్యంగా భారతీయ జీవిత బీమా వ్యాపార రంగంలో ఎల్సైసి ప్రస్థానం విడదీయరానిది. ఇప్పటి వరకు ఏ లక్ష్యాలతో అయితే భారతీయ జీవిత బీమా వ్యాపారాన్ని జాతీయం చేసి లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాగా ఏర్పాటు చేయటం జరిగిందో ఆ జాతీయీకరణ లక్ష్యాలను సాధించటంలో ఎల్ఐసి కృతకృత్యమైనది. జాతీయీకరణ లక్ష్య సాధన ద్వారా దేశీయ ఆర్థిక రంగానికి వెన్నెముకగా నిలిచింది. దేశ ఆర్థిక రంగాభివృద్ధికి 36 లక్ష కోట్ల రూపాయలను పెట్టుబడులుగా ఉంచింది. ఎల్ఐసి మొత్తం పెట్టుబడులలో 82 శాతం గవర్నమెంట్ సెక్యూరిటీలుగా, దేశ మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిర్దేశిరచినవే.ఎల్ఐసి ప్రతి సంవత్సరం సుమారు 5 లక్షల కోట్ల పెట్టుబడులను దేశ ఆర్థికాభి వృద్ధికి అందిస్తున్నది. ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలతో పోటీపడి 66 శాతం ప్రీమియం ఆదాయాన్ని 75 శాతం మేరకు పాలసీలను కైవసం చేసుకుని ప్రభుత్వ రంగ ఎల్ఐసి మార్కెట్ లీడర్‌గా నిలిచింది. క్లెయిముల చెల్లింపులలో, ఎక్కువ మొత్తం పాలసీదారులు కలిగి ఉన్న ఎల్ఐసి ప్రపంచంలోనే అతి పెద్ద సంస్థగా ఆవిర్భవించింది. 40 కోట్ల పట్టాదారుల ప్రయోజనాలను పణంగా పెట్టి...దేశ జనాభాలో కేవలం 3 శాతానికి పరిమితమైన స్టాక్ మార్కెట్ మదుపరులకు, దేశ ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేయగల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిదారులకు ఎల్ఐసిని కారుచౌకగా కట్టబెట్టే కార్యాచరణకు ప్రభుత్వం ఉపక్రమించడం దారుణం కాక మరోటి కాదు. దేశంలోనూ, అంతర్జాతీయంగానూ ఎల్ఐసి కి అనేక అనుబంధ సంస్థలు ఉన్నాయి. 14 దేశాలకు ఎల్ఐసి విస్తరించి ఉన్నది. అత్యంత నమ్మకమైన సంస్థగా అనేక సంస్థల టాప్ రేటింగ్స్‌లో ఉన్న ఎల్ఐసి బ్రాండ్ విలువను అంచనా వేయటమూ కష్టతరమే. ప్రభుత్వం పూనుకుంటున్న ఎల్ఐసి డిజిన్వెస్ట్‌మెంట్ ప్రక్రియ వలన లక్షల కోట్ల విలువైన ఎల్ఐసి సంస్థ వాటాలను తక్కువగా మూల్యాంకనం చేసే పరిస్థితి పరిణమించింది. తాజాగా ఆదానీలో పెట్టుబడులు, ఎల్ఐసికి ఉన్న ఉనికిని దెబ్బతీసేలా పరిణమించాయి.

## మిడ్డే మీల్స్ కార్మకుల వేతనం 3వేలకు పెంపు

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (సమ సమాజం):మిడ్ డే మీల్స్ కార్మికులు, సహాయకుల వేతనాన్ని పెంచుతూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం రూ.1000లుగా ఉన్న వారి వేతనాన్ని రూ.3వేలకు పెంచుతున్నట్లు ప్రకటించింది. ఇకపై కార్మికులకు చెల్లించే వేతనాల్లో రూ.2,400 రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వనుండగా.. మిగిలిన రూ.600లు కేంద్రం నుంచి రానున్నాయి. గత కొన్ని రోజులుగా మిడ్ డే మీల్స్ కార్మికులు సరిపడా జీతాలు అందడం లేదని రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేశారు. ఈ క్రమంలో ప్రభుత్వం వేతనాలు పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఇటీవలే మిడ్ డే మీల్స్ పథకం పేరును పీఎం పోషన్ పథకంగా మార్చినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో పీఎం పోషన్ పథకంలో భాగంగా కేంద్రం వాటా 60 శాతం ఉంటే రాష్ట్ర ప్రభుత్వం వాటా 40 శాతంగా ఉంటుంది.

# రెండోరోజూ ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాలు



(మొదటి పేజి తరువాయి) కరెంట్ విప్లవాత్మకమన్నారు. కరెంట్ కష్టాలను పారదోలిన ఘనత కెసిఆర్‌దని అన్నారు. వ్యయసాయానికి నీళ్లు అందించడంతో ప్రాజెక్టులను పూర్తి చేయడంతో రైతులు పంటలు పండించే అవకాశ వచ్చిందన్నారు. రైతై పాలకుడే పాలన ఎలా ఉంటుందో చెప్పడానికి తెలంగాణెళి నిదర్శనమని మంత్రి కేటీఆర్ అన్నారు. దేశం కడుపు నింపే స్థాయికి తెలంగాణ ఎదిగిందన్నారు. సీఎం తీసుకునే ప్రతి నిర్ణయం వెనుక మానవీయత ఉంటుందని చెప్పారు. రైతుబంధు, రైతుబీమా పథకాలు ప్రపంచంలోనే ఎక్కడా లేవని, ఐక్యరాజ్యసమితి కూడా రైతు బంధును ప్రశంసించిన విషయాన్ని ప్రస్తావించారు. రైతుబంధు తీసుకునే వారిలో 98శాతం చిన్న, సన్నకారు రైతులేనన్న కేటీఆర్.. రైతు చనిపోతే కుటుంబం రోడ్డున పడొద్దనే ఉద్దేశ్యంతో రైతు బీమా పథకం తీసుకొచ్చామన్నారు. ఇప్పటి వరకు 94,500 కుటుంబాలకు రైతు బీమా అందించినట్లు వివరించారు. నాబార్డ్ నివేదిక ప్రకారం వ్యవసాయ రంగంలో తెలంగాణ మూడో స్థానంలో ఉందని కేటీఆర్ చెప్పారు. బియ్యం ఉత్పత్తిలో పదో స్థానం నుంచి నాలుగో స్థానానికి చేరడం సంతోషంగా ఉందని అన్నారు. అయితే కేంద్రం తెచ్చిన నల్లచట్టాలకు 700మంది రైతుల బలికావడంపై బిజెపికి కొంతకూడా పాశ్చాత్తాపం లేకుండా పోయిందన్నారు. 24 గంటల కరెంట్ ఎక్కడిస్తున్నారో చెప్పాలన్న బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ విమర్శలపై మంత్రి కేటీఆర్ సెటైర్లు వేశారు. ఈటల రాజేందర్ బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు మంచిగా ఉండేవాడని, కానీ బీజేపీలోకి వెళ్లాక ఆయనలో మార్పు వచ్చిందని అన్నారు. కమలం పార్టీలోకి వెళ్లాక మనుషులు మారిపోతారని విమర్శిం చారు. రాష్ట్రంలో కేసీఆర్ రాక ముందు కరెంట్ ఎలా ఉండేదో వచ్చాక ఎలా ఉంటుందో ప్రజలకు తెలుసన్నారు. అప్పట్లో పవర్ హాలిడేస్ ఉంటే.. ఇప్పుడు పవర్ ఫుల్ డేస్ అని చెప్పారు. రాష్ట్రంలో మోటార్లకు మీటర్లు ఎందుకు పెట్టాలని కేంద్రాన్ని కేటీఆర్ ప్రశ్నించారు. మోటార్లుకు మీటర్లు పెట్టాలని రాష్ట్రానికి కేంద్రం లేఖ రాసిందని.. అయితే మీటర్లు పెట్టమని స్పష్టం చేశామని చెప్పారు. కేసీఆర్ ఉన్నంతకాలం రాష్ట్రంలో కేంద్రం పప్పులుడకవన్నారు. విద్యుత్ వినియోగంలో దేశంలోనే తెలంగాణ నెంబర్ వన్ స్థానంలో ఉందన్న కేటీఆర్ గుజరాత్‌లో విద్యుత్, నీటి సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ప్రస్తావించారు. ఊపర్ షేర్వానీ అందర్ పరేషానీ అన్నట్లుగా గుజరాత్‌లో పాలన ఉందని విమర్శించారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలో వైద్య సౌకర్యాలు ఎలా ఉన్నాయో అసెంబ్లీలో మంత్రి కేటీఆర్ వివరించారు. తెలంగాణ ఏర్పాటు కాకముందు ఇక్కడ కేవలం ఐదు మెడికల్ కాలేజీలు, ఏడు వందల సీట్లు ఉండేవని, తెలంగాణ వచ్చిన తర్వాత ఇవాళ 17 మెడికల్ కాలేజీల్లో 2790, ప్రైవేటు కాలేజీల్లో 3800 కలిపి మొత్తం తెలంగాణలో 6590 ఎంబీబీఎస్ సీట్లు ఇవాళ తెలంగాణలో విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇంకా కొత్త ఆసుపత్రులో తెలంగాణలో బ్రహ్మాండంగా కడుతున్నామని, తెలంగాణలోనే అన్నిటికన్నా పెద్ద ఆసుపత్రి, వరల్డ్ క్లాస్ సౌకర్యాలతో వరంగల్‌లో కడుతున్నామని, 24 అంతస్తులు, రెండువేల పడకలతో సకల హంగులతో నిర్మిస్తున్నామని మంత్రి కేటీఆర్ చెప్పారు. ఇదే కాదు హైదరాబాదులో గల్లీ గల్లీకో ప్రాథమిక వైద్య కేంద్రాన్ని ఏర్పాటు చేసి పేదలకు వైద్య సేవలు అందిస్తున్నా మని మంత్రి వెల్లడించారు. ఇవాళ రెండోసారి రాష్ట్ర ప్రజలకు కంటివెలుగు కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు. కంటి వెలుగులో కంటి పరీక్షలే కాదు అత్యంత నాణ్యమైన కళ్లద్దాలు కూడా ఇస్తున్నామని, అదీ మెడ్ ఇన్ తెలంగాణ అద్దాలు ఇస్తున్నామని చెప్పారు. మీ మోదీ మెక్ ఇన్ ఇండియా ఎక్కడపోయిందోగానీ మా మేక్ ఇన్ తెలంగాణ మాత్రం కళ్లముందు కనవడుతున్నదని చెప్పారు.

# నేడు నాందేడ్‌లో బిఆర్ఎస్ సభ





(మొదటి పేజి తరువాయి) మైదానమంతా కలియతిరిగి.. సభా వేదిక అలంకరణ, అతిథులు, ముఖ్య నేతల సీటింగ్‌పై నేతలకు దిశానిర్దేశర చేశారు. బీఆర్ఎస్ పార్టీ రూపాంతరం చెందిన తర్వాత జాతీయస్థాయిలో జరుగుతున్న తొలి సభ కావడంతో బీఆర్ఎస్ శ్రేణులు ప్రతిష్మాత్మకంగా ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, ఎమ్మెల్యేలు జోగు రామన్న, షకీల్, టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలముల్లు, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్ రవీందర్ సింగ, తదితర నేతలు గత కొన్ని రోజులుగా నాందేడ్‌లో ఉండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి గత వారం రోజులుగా నాందేడ్‌లో మకాం వేసి ఇతర నేతలతో సమన్వయం చేసుకుంటూ అన్నీ తానై సీఎం సభ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. సభ ఏర్పాట్లను దగ్గరుండి చూస్తూనే.. విస్తృతంగా గ్రామాల్లో పర్యటిస్తూ సర్పంచ్‌లు, ఇతర స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను కలుస్తూ సభ విజయవంతానికి అహర్నిశలు శ్రమిస్తున్నారు. అక్కడి వీధుల్లో కలియ తిరుగుతూ వృద్ధులు, మహిళలు, రైతులు, యువకులను పలకరిస్తూ.. తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నేతృత్వంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తున్నారు. దేశ ప్రగతి కోసం జాతీయ రాజకీయాల్లో గుణాత్మక మార్పు తీసుకురావడానికి ప్రత్యామ్నాయ రాజకీయాల కోసం సీఎం కేసీఆర్ చేస్తున్న కృషి గురించి తెలియజేస్తున్నారు. మరోవైపు నాందేడ్ జిల్లా కేంద్రంలో జరగనున్న బీఆర్ఎస్ సభకు పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, అభిమానులు హాజరు అవుతారని అంచనా వేస్తున్నారు. నాందేడ్ జిల్లాలోని నాందేడ్ సౌత్, నార్త్, బోకర్, నాయిగాం, ముఖేడ్, డెగ్లూర్, లోహ నియోజకవర్గాలు, కిన్వట్, ధర్మాబాద్ పట్టణాలు, ముద్కేడ్, నాయిగాం, బిలోలి, ఉమ్రి, హిమాయత్ నగర్, తదితర మండలాల్లోని అన్ని గ్రామాల నుండి పెద్దఎత్తున ప్రజలు తరలి వచ్చే అవకాశం ఉండటంతో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. అంతేకాకుండా నాందేడ్ జిల్లా సరిహద్దు తెలంగాణ నియోజకవర్గాలైన ఆదిలాబాద్, బోథ్, ముధోల్, బోధన్, జుక్కల్‌తో పాటు నిర్మల్, నిజామాబాద్ నియోజకవర్గాల నుంచి కూడా బీఆర్ఎస్ పార్టీ నేతలు, శ్రేణులు సభకు పెద్ద ఎత్తున తరలివచ్చే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

# 9 నుంచి ఆస్ట్రేలియాతో టెస్ట్ సీరిస్



## నెట్ ప్రాక్టీస్‌లో టీమిండియా బ్యాటర్లు

**నాగ్‌పూర్, ఫిబ్రవరి 4 (సమ సమాజం):** స్వదేశంలో వరుసగా వన్డే, టీ ట్వంటీలు నెగ్గి జోష్ మీదున్న టీమిండియా.. టెస్ట్ ఫార్మాట్‌లో అసలు సమరానికి రెడీ అవుతోంది. ఈ నెల 9 నుంచి ఆస్ట్రేలియాతో మొదలయ్యే నాలుగు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ బోర్డర్-గావస్కర్-ట్రోఫీ కోసం ప్రాక్టీస్ షురూ చేసింది. ఈ మెగా సిరీస్ కోసం బీసీసీఐ.. ఐదు రోజుల క్యాంప్‌ను ఏర్పాటు చేసింది. ఓల్డ్ వాకా స్టేడియంలో నెట్సెషన్స్ లో ప్రాక్టీస్ చేసింది. నెట్స్‌లో కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్, చతేశ్వర్ పుజారా, శుభ్‌మన్ గిల్‌తీవ్రంగా చెమటోడ్చారు. ఈ సిరీస్ నెగ్గితే అటు వరల్డ్‌చాంపియన్‌షిప్ ఫైనల్ బెర్త్‌తో పాటు లాంగ్ ఫార్మాట్‌లో నంబర్‌వన్ ర్యాంక్ దక్కే అవకాశం ఉండటంతో.. ఇండియా ఏ చాన్స్‌ను వదులుకోవడం లేదు. గాయంతో శ్రేయస్ అయ్యర్ తొలి టెస్టుకు దూరం అవ్వగా.. మోకాలి సర్జరీ నుంచి కోలుకున్న రవీంద్ర జడేజాతో పాటు, తెలుగు వికెట్ కీపర్ కేఎస్ భరత్ నెట్స్‌లో శ్రమించారు. జడేజా తొలుత ఇండోర్ సెషన్‌లో బౌలింగ్, బ్యాటింగ్ చేశాడు. తర్వాత బయట నెట్స్‌లోనూ బ్యాటింగ్ ప్రాక్టీస్‌లో పాల్గొన్నాడు. మార్నింగ్ సెషన్‌లో రెండున్నర గంటల పాటు ఓ బ్యాచ్ ట్రెయినింగ్‌లో పాల్గొనగా.. మధ్యాహ్నం మరో బ్యాచ్ చెమటోడ్చింది. ఇక, టీమిండియా నెట్ ప్రాక్టీస్ కోసం బీసీసీఐ కేవలం స్పిన్నర్లనే కేటాయించింది. వాషింగ్టన్ సుందర్, సౌరభ్ కుమార్, రాహుల్‌చహర్, సాయి కిశోర్ ఇందులో ఉన్నారు. ఎక్స్‌ట్రా పేసర్ల గురించి టీమిండియా ఎక్కువగా ఆలోచించడం లేదు. ఇక మెయిన్ టీమ్‌లో అశ్విన్, అక్షర్ పటేల్, కుల్దీప్, జడేజా ఉన్నారు. మరో రెండు రోజుల ప్రాక్టీస్ తర్వాత.. ఆసీస్ బలాన్ని లెక్కలోకి తీసుకుని టీమిండియా ఫైనల్ ఎలెవన్‌పై ఓ అంచనాకు రావొచ్చు. ఫ్రెండ్లీ వికెట్లపై ఇండియాను దీటుగా ఎదుర్కొనేందుకు ఆసీస్ కూడా అంతే పకడ్బందీగా ప్లాన్స్ రెడీ చేస్తోంది.

# జిమ్నాస్ట్ దీపా కర్మాకర్‌పై 21 నెలల నిషేధం



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4 (సమ సమాజం):** డోపింగ్ టెస్టులో విఫలమైన భారత జిమ్నాస్ట్ దీపా కర్మాకర్‌పై అంతర్జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ 21 నెలల నిషేధం విధించింది. నిషిద్ధ ఉత్ప్రేరకాలు తీసుకున్నందుకు దీపా కర్మాకర్‌ను ఇంటర్నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ దోషిగా తేల్చింది. 2021 అక్టోబర్‌లో దీపా కర్మాకర్ కు నిర్వహించిన శాంపిల్- ఏ టెస్టు ఫలితం పాజిటివ్‌గా వచ్చింది. అయినా ఈ విషయాన్ని బయటపెట్టలేదు. తాజాగా ఈ విషయం బయటపడటంతో ఆమెపై ఐటీఐ వేటు వేసింది. 2021 నుంచి శిక్షాకాలం అమలు కావడంతో ఈ ఏడాది జూలై 10 వరకు నిషేధం ముగుస్తుంది. ఇక దీపా కర్మాకర్ హైజెమిన్ ÷హా-3 బీటా-2 తీసుకున్నందుకు దోషిగా తేలింది. అంతర్జాతీయ డోపింగ్ ఏజెన్సీ హైజెమిన్ ఎస్-3 బీటా-2ను నిషేధిత ఔషధాల కేటగిరీలో చేర్చింది. 2014లో గ్లాస్గోలో జరిగిన కామన్వెల్త్ గేమ్స్‌లో దీపా కర్మాకర్ కాంస్య పతకాన్ని గెలుచుకుంది. కామన్వెల్త్ గేమ్స్ చరిత్రలో పతకం సాధించిన తొలి భారతీయ జిమ్నాస్ట్ గా రికార్డు సృష్టించింది. ఆ తర్వాత 2016 రియో ఒలింపిక్స్‌లో వాల్ట్ ఈవెంట్‌లో అద్భుతమైన ప్రదర్శన చేసిన దీపా కర్మాకర్ ?నాల్గవ స్థానంలో నిలిచింది. అయితే 2017లో కాలి గాయం వల్ల జిమ్నాస్టిక్స్‌కు దూరమైంది. గాయానికి శస్త్రచికిత్స చేయించుకున్నప్పటి కోలుకోలేదు. చివరి సారిగా 2019లో బాకులో జరిగిన ప్రపంచ కప్ ఈవెంట్?లో పాల్గొంది. తాజాగా నిషేధంతో దీపా అపారటస్ వరల్డ్ కప్ సిరీస్‌తో పాటు కనీసం మూడు వరల్డ్‌కప్ సిరీస్‌లకు కూడా దీప దూరం కానుంది. అయితే సెప్టెంబర్ 23 నుంచి ఆంట్‌వెర్ప్‌లో జరగనున్న వరల్డ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే అవకాశాలు ఉన్నాయి.

# ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ ఆండ్రూ టై ప్రపంచ రికార్డు



**మెల్‌బోర్న్, ఫిబ్రవరి 4 (సమ సమాజం):** పొట్టి క్రికెట్‌లో ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ ఆండ్రూ టై ప్రపంచ రికార్డు బద్దలు కొట్టాడు. ఈ ఫార్మాట్‌లో వేగంగా 300 వికెట్లు తీసిన బౌలర్‌గా అతను చరిత్ర సృష్టించాడు. 211 మ్యాచుల్లోనే అతను ఈ ఘనత సాధించడం విశేషం. అఫ్గనిస్థాన్ కెప్టెన్ రషీద్ ఖాన్ రికార్డును ఆండ్రూ టై బ్రేక్ చేశాడు. రషీద్ 213 మ్యాచుల్లో 300 వికెట్లు పడగొట్టాడు. బిగ్‌బాష్ లీగ్‌లో పెర్త్ స్కార్చెర్స్‌కు ఆడుతున్న టై ఫైనల్లో బ్రిస్బేన్ హీట్‌పై జేమ్స్ బాజ్‌లేను ఔట్ చేసి 300 వికెట్ సాధించాడు. పొట్టి క్రికెట్‌లో అతి తక్కువ మ్యాచుల్లో 300 వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో శ్రీలంక దిగ్గజం లసిత్ మలింగ మూడో స్థానంలో ఉన్నాడు. అతను 222 మ్యాచుల్లో 300 వికెట్లు తీశాడు. 2020లో రషీద్ ఖాన్, మలింగ రికార్డును బ్రేక్ చేశాడు. సీపీఎల్ టోర్నీలో బార్బడోస్ ట్రిడెంట్‌కు ఆడిన అతను సెయింట్ లూసియా జౌక్స్ ఆల్‌రౌండర్ మహమ్మద్ నబీని ఔట్ చేయడంతో 300 వికెట్ల క్లబ్‌లో చేరాడు. బిగ్‌బాష్ లీగ్‌లో ఆండ్రూ టై అద్భుత ప్రదర్శన చేశాడు. ఈ సీజన్‌లో అతను 26 వికెట్లు నేలకూల్చి పెర్త్ స్కార్చెర్స్ ÷నైల్ చేరడంలో తన వంతు పాత్ర పోషించాడు. బ్రిస్బేన్ హీట్‌తో జరిగిన ÷నైల్లో పెర్త్ స్కార్చెర్స్ 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన బ్రిస్బేన్ హీట్ నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 175 రన్స్ చేసింది. పెర్త్ స్కార్చెర్స్ 19.2 ఓవర్‌లోనే లక్ష్యాన్ని ఛేధించింది. ఆస్ట్రేలియా తరపున 2016- 2021 మధ్య ఆండ్రూ టై 32 టీ20లు ఆడాడు. 47 వికెట్లు పడగొట్టాడు.

## బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ ఆస్ట్రేలియాదే

### మాజీ క్రికెటర్ గ్రెగ్ ఛాపెల్ విశ్లేషణ



**మెల్‌బోర్న్, ఫిబ్రవరి 4 (సమ సమాజం):** బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని ఆస్ట్రేలియా గెలుస్తుందని ఆ దేశ మాజీ క్రికెటర్ గ్రెగ్ ఛాపెల్ అన్నాడు. టీమిండియా ప్రస్తుతం బలహీనంగా ఉందని చెప్పాడు. ముఖ్యంగా భారత జట్టు ఎక్కువగా కోహ్లీపై ఆధారపడుతోందని..అదే ఆసీస్?కు ప్లస్ పాయింట్ అవనుందన్నాడు. దీనికి తోడు టీమిండియాలో కీలక ఆటగాళ్లు పంత్, జడేజా, బుమ్రాలు గాయాలపాలయ్యారని..దీని కారణంగానే ఈ సారి బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ ఆస్ట్రేలియా సొంతం చేసు?కుంటుందని జోస్యం చెప్పాడు. టీమిండియాలోని పిచ్?లు స్పిన్ కు అనుకూలిస్తాయని..అందుకోసమే నాథన్ లియాన్?తో పాటు..అష్టన్ అగర్‌ను కూడా ఆస్ట్రేలియా తుది జట్టులో ఆడించాలని ఛాపెల్ సూచించాడు. వీరిద్దరు భారత్?ను ఇబ్బంది పెడతారని చెప్పాడు. గతంలో టీమిండియా దిగ్గజం అనిల్ కుంబ్లే ఇలాగే వికెట్లు పడగొట్టాడని..ఎ÷-లాట్ లెగ్ బ్రేకులు బ్యాట్స్‌మన్‌కు ప్రమాదకరంగా ఉండేవన్నాడు. బాల్ మిస్ అయితే వికెట్ పడేదన్నాడు. ప్రస్తుతం జడేజా బౌలింగ్‌లో ఇలాగే జరుగుతోందన్నాడు. 19 ఏళ్ల క్రితం ఆస్ట్రేలియా భారత్?లో బోర్డర్ గవాస్కర్ ట్రోఫి నెగ్గింది. 2004లో ఆసీస్ విజేతగా నిలిచింది. ఆ తర్వాత 2015,2017,2020లో భారతే గెలిచింది. ఈ నేపథ్యంలో ఈసారి ఎలాగైనా టెస్టు సిరీస్ గెలవాలని ఆస్ట్రేలియా పట్టుదలతో ఉంది. ప్యాట్ కమిన్స్ కెప్టెన్సీలోని ఆస్ట్రేలియా నాలుగు టెస్టులు ఆడనుంది. రెండు జట్ల మధ్య మొదటి టెస్టు ఫిబ్రవరి 9న నాగ్‌పూర్‌లో ప్రారంభం కానుంది.




# చితరసీమలో మరో విషాదం

## నేపథ్య గాయని వాణీజయరామ్ కన్నుమూత



చిత్రసీమలో మరో విషాదం చోటుచేసుకుంది. విశ్వనాథ మరణంతో తేరుకోని పరిశ్రమకు మరో దుర్వార్త చేరింది. ప్రముఖ నేపథ్య గాయని వాణీజయరామ్ కన్ను మూశారు. వాణీ జయరామ్(78) చెన్నైలోని తన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. 1945 నవంబర్ 30న దురైస్వామి, పద్మావతి దంపతులకు వాణీ జయరామ్ జన్మించారు. తమిళనాడులోని వెల్లూరు ఈమె స్వస్థలం. హిందూస్థానీ క్లాసికల్ సింగింగ్‌లో ప్రావీణ్యం పొందిన వాణీ జయరామ్ తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ హిందీ భాషల్లో 4500లకు పైగా పాటలు పాడారు. అందులో తెలుగులో 1000కు పైగా తెలుగు పాటలే! కెవి.మహదేవన్, ఎం.ఎస్. విశ్వనాథన్, ఇళయరాజా, పెండాల్య, చక్రవర్తి, సాలూరి రాజేశ్వరరావు సంగీతంలో ఎక్కువ పాటలు పాడారు. సంగీత రంగానికి ఆమె చేసిన సేవలకు గానూ కేంద్ర ప్రభుత్వం ఆమెను పద్మ భూషణ్ అవార్డును ప్రకటించగా, అది అందుకోకుండానే ఆమె కన్ను మూయడం బాధాకరం. మూడు జాతీయ పురస్కారాలను కూడా ఆమె అందుకున్నారు. వాణీ జయరామ్ మరణంతో సంగీతలోకం కన్నీరుమున్నీరైంది. సినీ ప్రముఖులు ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నారు.




'ఆర్‌ఆర్‌ఆర్' జైత్రయాత్ర జపాన్‌లో ఇంకా కొనసాగుతూనే ఉంది. రోజు రోజుకు ట్రిపుల్‌ఆర్ సినిమాకు జపాన్‌లో ఆధరణ పెరుగుతూనే ఉంది. ఈ మధ్య కాలంలో ఓ సినిమా నెల రోజులు ఆడిందంటే అది గొప్ప విషయం. అలాంటిది ఆర్‌ఆర్‌ఆర్ వంద రోజులను దాటేసింది. అది కూడా మూడు వేల ఏడు వందల మైల్స్ దూరంలో ఉన్న జపాన్‌లో. మన సినిమా పక్క దేశంలో వంద రోజులు ఆడిందంటే అది చిన్న విషయం కాదు. గతేడాది అక్టోబర్ 21న భారీ ఎత్తున రిలీజైన ఈ సినిమా అంతే భారీ స్థాయిలో ఓపెనింగ్స్ రాబట్టింది. తొలివారంలోనే రూ.4 కోట్లకు పైగా కలెక్షన్‌లు సాధించి.. ఫస్ట్ వీక్‌లో అత్యధిక కలెక్షన్లు సాధించిన ఇండియన్ సినిమాగా సరికొత్త రికార్డు క్రియేట్ చేసింది. అంతేకాకుండా 24ఏళ్లుగా రజనీకాంత్ ముత్తు(24.14 కోట్లు) పేరిట ఉన్న రికార్డును నాలుగు వారాల్లోనే బ్రేక్ చేసి సంచలనం సృష్టించింది. ఇక ఇటీవలే 114 కేంద్రాల్లో వంద రోజులు పూర్తి చేసుకుని అరుదైన రికార్డును క్రియేట్ చేసింది. కాగా తాజాగా ఆర్‌ఆర్‌ఆర్ మరో రేర్ ఫీట్‌ను సాధించింది. ట్రిపుల్‌ఆర్ తొలిరోజు కలెక్షన్‌లను పోల్చితే 105వ రోజు ఎక్కువ కలెక్షన్‌లు రాబట్టినట్లు మేకర్స్ వెల్లడించారు. అంతేకాకుండా ఇప్పటి వరకు జపాన్‌లో ఈ సినిమాను 5,13,787 మంది వీక్షించినట్లు తెలిపారు. ఆస్కార్ బరిలో చోటు దక్కించుకున్నాక ఈ సినిమాపై క్రేజ్ మరింత పెరిగింది. బిగ్ స్క్రీన్‌లో సినిమా చూడడానికి జపాన్ ప్రేక్షకులు థియేటర్‌లకు ఎగపడుతున్నారు. ఇటీవలే జపాన్‌లో డాల్బీ విజన్ స్పెషల్ ప్రింట్‌ను అప్‌గ్రేడ్ చేశారు. జక్కన్న రాజమౌళి తెరకెక్కించిన ఈ అద్భుత దృశ్యకావ్యం ఎన్నో వాయిదాల తర్వాత మార్చి 25న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. తొలి రోజు నుండి వసూళ్ల పరంపర కొనసాగించింది. 'బాహుబలి-2' పేరిట ఉన్న ఎన్నో రికార్డులను బ్రేక్ చేసింది. ఈ సినిమాతో ఇండియాలో రెండు సార్లు 1000కోట్ల మార్కును టచ్ చేసిన ఏకైక దర్శకుడిగా రాజమౌళి రికార్డు సృష్టించాడు. ఇక నైజాంలో 100కోట్ల షేర్ సాధించిన మొదటి సినిమాగా 'ఆర్‌ఆర్‌ఆర్' సరికొత్త రికార్డు సృష్టించింది.

# కోలుకుంటున్న నటి సమంత

## సిటాడెల్ వెబ్‌సీరిస్ షూట్‌తో బిజీ




యశోద సినిమాతో భారీ విజయాన్ని మూటగట్టుకున్న స్టార్ హీరోయిన్ సమంత తిరిగి సినిమాలతో బిజీ కానుందన్న వార్త గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తోంది. నటుడు వరుణ్ ధావన్ తో సిటాడెల్ అనే వెబ్ సిరీస్ లో సమంత నటిస్తోంది. ముంబైలో ఈ యాక్షన్ సిరీస్ చిత్రీకరణ షురూ అయిందనే వార్తలు కూడా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే సామ్ చేసిన ఓ పోస్ట్ ఆ వార్తలు నిజమేనని నిరూపించేవిగా ఉన్నాయి. ఈ ఫొటోల్లో చిత్ర యూనిట్ తో సామ్ ముచ్చటిస్తూ కనిపించింది. దాంతో పాటు షేర్ చేసిన మరొక ఫొటోలో సమంత బెడ్ పై పడుకొని ఉంది. అంటే సైలెన్స్‌తో లేవలేని స్థితి నుంచి మళ్లీ మామూలు స్థితికి వచ్చానని సామ్ చెప్పకనే చెప్పింది. ఈ పోస్ట్ తో సమంత మళ్లీ సినిమాలను చేయనుందని ఆమె ఫ్యాన్స్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దీంతో దాదాపు ఏడెనిమిది నెలలు మయోసైటిస్ వ్యాధితో బాధపడిన సమంత.. ఇప్పుడు కోలుకుందని సామ్ అభిమానులు సంబరపడి పోతున్నారు. ఇక సిటాడెల్ సిరీస్ దర్శకద్వయం రాజ్ అండ్ డీకె దర్శకత్వంలో తెరకెక్కనుంది. అయితే అమెజాన్ ప్రైమ్ ఒరిజినల్ సిరీస్ గా భారీ బ్జడెట్ తో దీన్ని నిర్మించబోతుండడం చెప్పుకోదగిన విషయం.




# బుట్టబొమ్మలో కథే హీరో : సిద్ధు

అనిక సురేంద్రన్, అర్జున్ దాస్, సూర్య వశిష్ట లీడ్ రోల్స్‌లో శౌరి చంద్రశేఖర్ రమేష్ రూపొందించిన చిత్రం 'బుట్టబొమ్మ' శనివారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి గెస్ట్‌గా హాజరైన సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ 'సితార సంస్థ నాకు హోమ్ బ్యానర్ లాంటిది. వాళ్ళ సినిమా అంటే నా సినిమా లాంటిదే. 'బుట్టబొమ్మ'లో కథే హీరో. ఎంత సాఫ్ట్ గా ఉంటుందో, అంతే వైల్డ్‌గా ఉంటుంది. టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్' అని చెప్పాడు. దర్శకులు మారుతి, సంపత్ నంది, శైలేశ్ కొలను, అనుదీప్ సినిమా సక్సెస్ సాధించాలని విష్ చేశారు. ఈ చిత్రంతో తమకు మంచి గుర్తింపు వస్తుందనే నమ్మకం ఉందన్నారు నటీనటులు. దర్శకుడు రమేష్, నిర్మాత సూర్యదేవర నాగవంశీ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in